క్లుప్తంగా

సభ్యత్వ నమోదు పెంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

కొండపి: గ్రంథాలయ సభ్యత్వ నమోదు పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి గ్రంథపాలకుడికి పలు సూచనలు చేశారు. గ్రంథాల సెస్ బకాయిలు సంబంధిత అధికారులు కలిసి వసూలు చేయాలన్నారు. పాఠకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రామాంనేయులు, ఈఓఆర్డీని కలిసి డిమాండ్ కలెక్షన్ అయిన వాటిలో గ్రంథాలయ సెస్‌కు జమ చేయాలని కోరారు. గ్రంథపాలకుడు సత్యనారాయణ పాఠకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కొండపి: మండలంలోని మిట్టపాలెం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అవ్వారి పిచ్చమ్మ, ముప్పారాజు వీరయ్యలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. యూటీఎఫ్ బాధ్యులు సురేష్, మాలకొండయ్య, మల్లికార్జున, చంద్రశేఖర్, ఇతర ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పొగాకు వేలం ప్రారంభం

టంగుటూరు: 2024–25 సంవత్సరానికి స్థానిక వేలం కేంద్రంలో బుధవారం వేలం ప్రారంభమవుతుందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి రోజు చింతలపాలెం, దావగూడూరు క్లస్టర్ గ్రామాలకు చెందిన రైతులు 18 బేళ్లకు అనుమతి ఇచ్చామన్నారు. వేలం కేంద్రం పరిధిలో 2,834 మంది రైతులు, 2818 బ్యార్నీలు ఉన్నాయన్నారు. మొత్తం 6,234 హెక్టార్లలో పంట సాగు చేయగా 11.76 మిలియన్ కేజీల పొగాకుకు అనుమతి ఇచ్చామన్నారు. రైతులు పంటను వేలం కేంద్రంలోనే అమ్ముకోవాలన్నారు. బయట విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శీతల గిడ్డంగుల్లో పెట్టుకునే ముందు బోర్డు అనుమతి తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అక్రమంగా పొగాకు కొనుగోలు చేసే దళారులు, మధ్యవర్తులను గుర్తించి బోర్డుకు, విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

జనసేనలో భగ్గుమన్న విభేదాలు

సింగరాయకొండ: మండలంలో జనసేన పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. పార్టీ మండల ఉపాధ్యక్షుడు షేక్ షాన్‌బాషా, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా హుస్సేన్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అయినాబత్తిన రాజేష్ ప్రకటించారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని, వారి చర్యలు పార్టీకి నష్టం చేకూరుస్తున్నాయని తెలిపారు. దీనిపై షాన్‌బాషా, ఖాజాహుస్సేన్‌లు ఇద్దరు జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మా ఇద్దరిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి రాజేష్ ఎవరని ధ్వజమెత్తారు. పార్టీని అడ్డుపెట్టుకుని రాజేష్ దోచుకుంటున్న విషయం అందరికీ తెలుసన్నారు. రేషన్ దుకాణాలు, సిమెంట్ కాంట్రాక్టులు తీసుకున్నాడని తెలిపారు. ఒంగోలులో మీ కోసం కార్యక్రమంలో అధికారులపై ఫిర్యాదు చేస్తూ వారిని బెదిరిస్తూ లబ్ధి పొందుతున్నాడని విమర్శించారు. ఇటీవల పిఠాపురం పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి మండలం నుంచి కేవలం ఐదుగురిని మాత్రమే తీసుకెళ్లాడని, అతని చర్యలతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలి

కనిగిరిరూరల్: ప్రభుత్వం విద్యుత్ మీటర్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌యాసీన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యాసీన్ మాట్లాడుతూ విద్యుత్ మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. స్మార్ట్ మీటర్స్ పేరుతో వారి ఉద్యోగాలను తొలగించి వారి భవిష్యత్తు అంధకారం చేయడం తగదన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు ఖాశింపీరా, విద్యుత్‌మీటర్స్ రీడర్స్ యూనియన్ నాయకులు పిచ్చయ్య, ఐజాక్, ఎలీషా, అబ్దుల్, ప్రభాకర్, రఫీ, రవి, ఏడుకొండలు, చాంద్, ప్రసాద్, కృష్ణా, కొండలు, కొండయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

మంచినీళ్లివ్వండి మహాప్రభో..!

- మంచినీటి కోసం కల్లూవారిపాలెం గ్రామస్తులు అగచాట్లు
- పాచిపట్టి కలుషితమైన రక్షిత మంచినీటి బావి
- కలుషితమైన నీటిని తాగడానికి గ్రామస్తుల విముఖత
- కె.అగ్రహారం నుంచి బైక్‌తో బబుల్ వాటర్ తెచ్చుకుంటున్న వైనం
- మంచి నీటి సమస్య తీర్చాలని గ్రామస్తుల వేడుకోలు



మంచినీటి స్కీం బావిలో పాచిపట్టి అపరిశుభ్రంగా ఉన్న నీళ్లు

పొన్నలూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.లక్షల వెచ్చించి నిర్మించిన రక్షిత మంచినీటి పథకాల స్కీమ్ బావుల్లో నేడు ఊటనిల్వలు పూర్తిగా అడుగంటపోతున్నాయి. దీంతో స్కీమ్ బావులపై ఆధారపడిన గ్రామీణ ప్రజలు తాగు, వాడుక నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని కోటపాడు పంచాయతీ కల్లూరివారిపాలెంలో ప్రస్తుతం అదే పరిస్థితి ఏర్పడింది. ఈ గ్రామంలో సుమారుగా 200 కుటుంబాలు ఉన్నాయి. 2004లో గ్రామస్తులకు నీటి కష్టాలు తొలగించడానికి రూ.లక్ష వెచ్చించి గ్రామానికి సమీపంలోని పాలేరులో రక్షిత మంచినీటి స్కీమ్ బావిని ఏర్పాటు చేశారు. ఈ స్కీమ్ బావి నుంచి గ్రామంలో ఏర్పాటు చేసిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో పైపులైన్ ద్వారా నీటి నిల్వచేసి ఇక్కడ నుంచి కుళాయిలతో గ్రామస్తులకు నీటిని అందిస్తున్నారు. కానీ ఇటీవల రక్షిత మంచినీటి పథకాన్ని సక్రమంగా నిర్వహించకపోవడంతో పాటు, బావిలో వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటి ఊటనిల్వలు పూర్తిగా తగ్గిపోవడంతో గ్రామస్తులు నీళ్ల కోసం అవస్థలు పడుతున్నారు. అలాగే బావిలో కొంతమేర నీళ్లు ఉన్నా అవి పూర్తిగా పాచిపట్టి కలుషితమై అపరిశుభ్రంగా ఉన్నాయి. అయితే స్కీం బావిలో పాచిని తొలగించకపోవడంతో అనారోగ్యానికి గురవుతామని భావించి ఈ నీళ్లు తాగడానికి గ్రామస్తులు విముఖత చూపిస్తున్నారు. దీంతో కొన్ని రెండు నెలల నుంచి గ్రామంలో తాగు, వాడక నీటి కోసం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అలంకారప్రాయంగా ఓవర్‌హెడ్ ట్యాంక్

స్కీమ్ బావిలో నీళ్లు అడుగంటి పోవడంతో నీటి సరఫరా సక్రమంగా లేక గ్రామంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్ అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. అలాగే పైప్‌లైన్ కూడా అక్కడక్కడ వాల్స్ పూర్తిగా దెబ్బతిని వాడుక నీరు వృథాగా పోతున్నాయి. ఇక చేతి పంపుల్లో కూడా సరిపడినన్ని నీళ్లు రావడం లేదు. కొన్ని కుటుంబాల ప్రజలు మంచి నీటి సౌకర్యం లేకపోవడంతో చేతి పంపుల్లో వచ్చే ఫ్లోరైడ్ నీటిని తాగుతూ అనారోగ్యానికి గురవుతున్నారు. ఎస్సీ పల్లెలోని చేతి పంపులు సక్రమంగా పనిచేయకపోవడంతో ఆ కాలనీలో నివసిస్తున్న 40 కుటుంబాల ప్రజలు తాగు, వాడుక నీటి కోసం అల్లాడిపోతున్నారు. స్కీం బావి నుంచి వచ్చే నీటిని వాడుక నీటిగా ఉపయోగిస్తున్నప్పటికీ అవి అవి అపరిశుభ్రంగా ఉండటంతో స్నానం చేసేటప్పుడూ శరీరం దురద వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు.

5 కిలోమీటర్లు వెళ్లి..

పాలేరులోని రక్షిత మంచినీటి పథకం బావిలో భూగర్భజలాలు అడుగంటి, ఉన్న నీళ్లు కూడా పాచిపట్టి కలుషితంగా ఉండటంతో గ్రామస్తులు ఈ నీళ్లు తాగడానికి ముందుకు రావడం లేదు. అధికారులు కూడా అపరిశుభ్ర నీటిని శుద్ధి చేయించకపోవడంతో తాగునీటి కోసం గ్రామంలోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్కీం బావిలోని నీళ్లు అపరిశుభ్రంగా ఉండటంతో చేసేది లేక బబుల్ వాటర్‌ను ఆశ్రయిస్తున్నారు. దీంతో గ్రామస్తులు ద్విచక్ర వాహనాలపై ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కె.అగ్రహారం సెంటర్‌కు వెళ్లి ప్రైవేట్ వాటర్ ప్లాంట్స్ నుంచి 20 లీటర్ల నీటిని రూ.15 కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. అలాగే ద్విచక్ర వాహనాలు లేని వారు గ్రామానికి వచ్చే ఆటోలు దగ్గర రూ.20 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇలా రోజూ తాగు నీటిని కొనాలంటే ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్కీం బావిలోని నీటిని శుభ్రపరిచి మంచినీళ్లు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కె అగ్రహారం నుంచి బైక్‌పై బబుల్ వాటర్ తీసుకెళ్తున్న గ్రామస్తుడు

నేటి నుంచి పొగాకు కొనుగోళ్లు

- ధరలపైనే పొగాకు రైతుల ఆశలు.

కనిగిరిరూరల్: కనిగిరి ప్రాంతంలో అత్యధికంగా సాగు చేసే పంటల్లో వాణిజ్య పంట పొగాకు. ఈ పంటను అన్ని మండలాల్లోని రైతులు సాగు చేస్తారు. గత ఏడాది పొగాకు ఉత్పత్తులు, ధరలు బాగా ఉండటంతో ఏడాది కూడా రైతులు పొగాకు సాగును అధికంగా చేశారు. ఇప్పటికే జిల్లాలోని చాలా కేంద్రాల్లో పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం కాగా.. ఈనెల 19 నుంచి మంగళవారం నుంచి కనిగిరి పొగాకు బోర్డు పరిధిలోని గ్రామాల్లో పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. కనిగిరి బోర్డు పరిధిలోని 5 క్లస్టర్లలో 1,245 బ్యారన్‌లు ఉండగా. అందులో పొగాకు సాగు విస్తీర్ణం సుమారు 4,980 హెక్టార్లు కాగా, పొగాకు ఉత్పత్తి 8.6 మిలియన్ కేజీలు వచ్చినట్లు అంచనా. బుధవారం చాకిరాల, మాచవరం గ్రామలకు చెందిన పొగాకు బేళ్లను వేలం కేంద్రంలో అనుమతి జరుగుతుందని, గురువారం తుమ్మకుంట క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతులు వేలం కేంద్రానికి బేళ్లు తెచ్చుకోవాలని అధికారులు తెలిపారు.



పొగాకు బేళ్ల ను పరిశీలిస్తున్న అధికారులు

ధరలపైనే ఆశలు...

ఈ ఏడాది పొగాకు దిగుబడులు ఆశాజనకంగానే ఉన్నాయి. అయితే దాని తగ్గట్టు పంట పెట్టుబడి ఖర్చులు భారీగా పెరిగాయి. గత ఏడాదితో పోలిస్తే కౌలు ధరలు, బ్యారన్ ధరలు, కూలీల రేట్లు బాగా పెరిగాయి. దానికి తగ్గట్టు పొగాకు ధరలు మార్కెట్లో ఏలా ఇస్తారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు వేలం జరిగిన కేంద్రాల్లో కేజీ పొగాకు ధర సరాసరిన రూ. 275 ఉండగా.. అత్యధిక ధర రూ. 280 వచ్చింది. ఈ ధరలపై పొగాకు రైతులు ఆందోళన చెందుతున్నారు. గత రెండేళ్లుగా పొగాకుకు మార్కెట్‌లో రైతులకు లాభాల పంట పండింది. పండిన పంటకు, పెట్టుబడులకు పోను రైతులకు లాభం మిగిలింది. ఈ ఏడాది ఆ పరిస్థితి కన్పించడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు.

సరాసరి ధర రూ.300 ఇవ్వాలి:



ఈ ఏడాది రైతుకు ధరకు పెట్టుబడులు పెరిగాయి. బ్యారన్ లీజుతో పాటు, పచ్చాకు ముఠా కూలీలు, కౌలు, బ్యార్నీ సామాగ్రి ధరలు పెరిగాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలి. పొగాకు రైతుకు కేజీ సరాసరి ధర రూ.300 ఇవ్వాలి.
సూరసాని మోహన్‌రెడ్డి (వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి)

రసాయనిక ఎరువులతో భూములు నిస్సారం

సీఎస్‌పురం(పామూరు): రైతులు అవసరాలకు మించి అధికంగా రసాయనిక ఎరువులు వాడటం వల్ల భూములన్నీ నిస్సారమై పోతున్నాయని కనిగిరి ఏడీఏ ఏ వెంకటరమణ అన్నారు. మండలంలోని రేగులచెలక, చెన్నపునాయునిపల్లి గ్రామాల్లో మంగళవారం ఏఓ బి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ వెంకటరమణ వరిసాగుచేసిన రైతులు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. రైతులు అధికంగా రసాయనిక ఎరువులు వాడుతున్నారని, వీటి వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. ఏఈఓ పావలి శ్రీనివాసులు, వీఏఏలు యం.వెంకటేశ్వర్లు, వి.చిరంజీవి, రైతులు పాల్గొన్నారు.

కొండపి: రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏడీఏ ఈ నిర్మలకుమారి అన్నారు. మండలంలోని వెన్నూరు, కట్టుబడిపాలెం గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్, సాంకేతిక వ్యవసాయ అధికారి మాల్యాద్రి,గ్రామ వ్యవసాయ సహాయకుడు జె కొండలరావు రైతులు పాల్గొన్నారు.

పామూరు: వ్యవసాయంలో యంత్రాల వినియోగానికి రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయాధికారి కంచం రాధ అన్నారు. మండలంలోని ఇనిమెర్ల, తూర్పు కట్టకిందపల్లె గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ వ్యవసాయంలో యాంత్రీకరణ, ఫార్మర్ రిజిస్ట్రేషన్ గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా రైతుసేవాకేంద్రాల్లో 2024–25 రబీకి సంబంధించి పంట నమోదు జాబితాలను ప్రదర్శించారు. రైతులు పంటసాగు జాబితాలను పరిశీలించి పొరపాటు ఉంటే సరిచేసుకోవాలన్నారు. వీఏఏలు సుబ్బారావు, యామిని, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సాగులో సూచనలిస్తున్న ఏడీఏ వెంకటరమణ



మాట్లాడుతున్న ఏడీఏ నిర్మలకుమారి

హాస్టల్‌ను మూసివేస్తే ఉద్యమిస్తాం

కనిగిరిరూరల్: పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను వేరే ప్రాంతానికి తరలించి దళిత విద్యార్థులను అన్యాయం చేయవద్దని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత, ప్రజా, బహుజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపి, అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. గతంలో కనిగిరిలో రెండు ఎస్సీ హాస్టల్స్ ఉండేవని, ఒక దాన్ని కంచర్లవారి పల్లికి తరలించారని, మరలా రెండో దాన్ని కూడా వేరే ప్రాంతానికి తరలించడం సరైంది కాదన్నారు. సుమారు 46 ఏళ్ల చరిత్ర కల్గిన ఎస్సీ వసతి గృహాన్ని ప్రభుత్వం, అధికారులు నిర్వీర్యం చేయాలని చూడటం సరైంది కాదన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఎస్సీలు సుమారు 60 వేల మంది ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. హాస్టల్ తరలింపుపై ఏఎస్‌డబ్ల్యూని అడగ్గా.. తనకు తెలియదని డీడీ అడగాలని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడాన్ని తీవ్రంగా మండిపడ్డారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చదలవాడ బాలగురవయ్య, చీకటి వెంకట సుబ్బయ్య, దమ్ము వెంకటయ్య, కటికల అగస్టీన్, బాల బాదుర్లా, సుధాకర్, సియాద్రి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రజా, దళిత, కుల సంఘాల నాయకులు ఎస్సీ హాస్టల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పీవీ శేషయ్య, కోటపాటి రమణ, పలుకూరి భాస్కర్, రామ్మోహన్, నాగయ్య, శివ, సుధాకర్, అగస్టీన్, మేళం రాములు, పరశురాం పాల్గొన్నారు.

సమష్టిగా అభివృద్ధి చేద్దాం

కనిగిరిరూరల్: సమష్టిగా పనిచేసి.. పట్టణ అభివృద్ధిని చేద్దాం అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. మున్సిపల్ పాలక వర్గం ఏర్పాటై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మంగళవారం కేక్ కట్ చేశారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ మనమంతా ఐక్యతగా పనిచేసి మరింత అభివృద్ధిని చేద్దామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ డానియేల్ జోసఫ్, కౌన్సిలర్లు తమ్మినేని సుజాత, దేవకి సత్యావతి, దేవరాజ్, ఎస్‌కే ఖాశింసా, అరుణోదర్, చింతం శ్రీనివాసుల యాదవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చైర్మన్ గఫార్, కౌన్సిలర్లు,

వైఎస్ జగన్‌ను కలిసిన దద్దాల,చింతలచెర్వు





వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో దద్దాల నారాయణ, చింతలచెర్వు

కనిగిరిరూరల్: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్థివదేహానికి నివాళులర్పించేందుకు బాపట్ల జిల్లా మేదరమెట్లకు వచ్చిన వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, రెడ్డి కార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెర్వు సత్యనారాయణరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

పామూరు: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. ఈనెల 20వ తేదీన తలపెట్టిన ఛలో ఆర్డీఓ కార్యాలయం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఇనిమెర్లలో చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పొగాకు రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పొగాకు, కంది, వరి, మిరప, శనగ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతుల ఇళ్లలోనే మగ్గుతున్నాయని, గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నిమ్జ్ పనులు ప్రారంభించాలని, త్రిపుల్‌ఐటీ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఛలో ఆర్డీఓ కార్యాలయ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. సీపీఎం మండల అధ్యక్షుడు ఖాదర్‌బాషా, వై.వీరనారాయణ, కాశీ శంకర్, వెంకటేశ్వర్లు, రామయ్య, అంకయ్య, కొండయ్య, వెంకటస్వామి, రైతులు పాల్గొన్నారు.

అన్య పదార్థాలు లేకుండా చూడాలి

కొండపి: గ్రేడింగ్ చేసే సమయంలో పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూసి బేళ్లు కట్టాలని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ రైతులకు సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం రైతులకు సూచనలు చేశారు. రామాయపాలెం, చౌటపాలెం, దాసిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 253 బేళ్లను వేలానికి తీసుకురాగా అందులో 227 బేళ్లను కొనుగోలు చేసి 26 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260, సరాసరి రూ.273.94 పలికింది. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇటుక కార్మికులకు కనీస వేతనాలు అందించాలి

కొండపి: ఇటుక కార్మికులకు కనీస వేతనాలు అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కొండపిలో మంగళవారం రోజు సీపీఎం బృందం ఇటుక రాయి కార్మికుల స్థితిగతులు పరిశీలించింది. ఈ సందర్భంగా కార్మికులు జతకు రూ.1.20 లక్షలు అడ్వాన్సు తీసుకొని దొనకొండ, దర్శి నుంచి కొండపికి వచ్చామని, ఐదు నెలలు పనిచేస్తే అన్ని ఖర్చులు పోను రూ.20 వేలు మిగులుతాయని, ఏదైనా అనారోగ్యానికి గురైతే అప్పులే మిగులుతాయని సీపీఎం బృందం ఎదుట విన్నవించారు. ఇలాంటి సమయంలో నూతన యంత్రాలు రావడంతో కూలీ తగ్గుతుందని, ఉన్న భృతి కూడా కోల్పోతామని ఆందోళన చెందుతున్నామన్నారు. మస్తాన్ మాట్లాడుతూ మట్టిలో బండెడు చాకిరీ చేసే ఇటుక కార్మికులకు సరైన వసతులు, వేతనాలు లేవన్నారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న ఒంగోలులో జరిగే ధర్నాలో పాల్గొనాలన్నారు. సీపీఎం మండల నాయకులు రూబెన్, వందనం, కూలీలు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



స్వామిని పురవీధుల్లో ఊరేగిస్తున్న దృశ్యం

మర్రిపూడి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన దేవాలయాల్లో ఒకటైన పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. పృధులగిరి లక్ష్మీనృసింహస్వామి ప్రతిమలను పల్లకిపై ఉంచి కొండపై నుండి మేళతాళలతో ఊరేగించి, విష్ణుదేవాలయం వద్దకు తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు నారాయణం ఆదిశేషాచార్యులు లక్ష్మీదేవి సమేత స్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి, వేద మంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. స్వామికి నూతన వస్త్రాలు ధరించి, శేషపాన్పుపై పవళింపచేశారు. అనంతరం రాత్రికి శివాలయం ప్రాంగణంలో ఏకాంతసేవ నిర్వహించారు. చుండి లక్ష్మీనరసింహారావు, కనకరాఘవరావులు ఉభయదాతలు వ్యవహరించారు. కార్యనిర్వహణాధికారి నర్సా నారాయణరెడ్డి, బీఎల్ఎన్ శాస్త్రి, మాచవరం ప్రసాదు, బరూరి మాణిక్యశాస్త్రి, గంద్రకోట శ్రీనివాస్, శ్రీకంఠం సుబ్బారావు, హరి, వినయ్ పాల్గొన్నారు.

ఫర్నీచర్ అందజేత

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కంభంపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పాఠశాల పూర్వ విద్యార్థి మితికల గురుబ్రహ్మం మంగళవారం 12 కుర్చీలను అందజేశారు. ఈసందర్భంగా దాతను హెచ్‌యం ఎ.సంజీవ రాణి అభినందించారు. జి.వెంకటేశ్వర్లు, షేక్.మహబూబ్‌జాని, విద్యార్థులు పాల్గొన్నారు.